ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234 www.kakatiyanews.com
బుధవారం, 26 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 13 | పేజీలు: 6 వెల: 5



## ఫీజు బకాయిలు చెల్లించండి

# లేదంటే మరో ఉద్యమమే!

### రేవంత్ సర్కారుపై ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం

- ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు, తల్లిదండ్రులు సతమతం
- కాంగ్రెస్ కార్యకర్తల్లోనే రేవంత్ తీరుపై అసంతృప్తి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు వదిలిపెట్టం
- ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజం



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం

........(తరువాయి 2లో)




- 98 శాతం భూములు తొలగించామని మంత్రి పొంగులేటి చెప్పడం పచ్చి అబద్ధం
- బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు
- 22ఏ జాబితా వెనుక భారీ కమీషన్ల బాగోతం ఉందని ఆరోపణ
- నిషేధిత జాబితాను బహిర్గతం చేయాలి.. శ్వేతపత్రం విడుదల చేయాలి
- సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీలో బాధితుల తరపున పోరాడతాం : మాజీ మంత్రి హరీశ్‌రావు

# 22ఏ భూములపై సమరం

### నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలని డిమాండ్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**


22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు.. క్షేత్రస్థాయిలో బాధితుల పరిస్థితులకు పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. "98 శాతం భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెబుతున్న మాటలు పచ్చి అబద్ధం. అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు చెప్పుకోవడానికి సమావేశానికి ఎందుకు వస్తారు?" అని ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్‌నగర్‌లోని ఎం.జే. గార్డెన్స్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆధ్వర్యంలో 22ఏ నిషేధిత భూముల బాధిత కుటుంబాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

........(తరువాయి 2లో)

## ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూపీఆర్ఎస్ రిపోర్టులు చెంపపెట్టు!

- అన్నారం, సుందిళ్లలో నిర్మాణపరమైన సమస్యలు లేవని స్పష్టం
- అవసరాన్ని బట్టి కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేసుకోవచ్చు
- ఎన్‌డీఎస్ఏ నివేదికలో ఇదే ఉంది
- గోదావరి జలాలను కిందికి వదిలేస్తూ తెలంగాణ రైతులకు అన్యాయం
- అన్నారం, సుందిళ్ల మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

2




## గిరిజన సంక్షేమ శాఖలో శ్రీనివాసుడి లీలలు

- నచ్చితేనే ఫైల్ క్లియర్.. అన్ని అర్హతలున్నా క్లియరెన్స్‌కు వేధింపులు
- నిబంధనలతో పనిలేకుండా అధికారి వ్యవహారం
- రాజకీయ అండదండలున్నాయంటూ డిపార్ట్‌మెంట్‌లో హల్‌చల్
- సార్ సర్టిఫైడ్ కోసం నెలలుగా వేచి చూస్తున్న ఉద్యోగుల ఫైళ్లు
- బిల్లుల క్లియరెన్స్‌కు బ్రోకర్లతో వెళ్తేనే పని పూర్తయ్యేది..!
- గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో చక్రం తిప్పుతున్న అధికారి

3

ఫీజు బకాయిలపై దీక్ష..

## రెండో రోజే విరమణ

- ఆరోగ్యం క్షీణించడంతో రాంచందర్‌రావు దీక్షకు బ్రేక్
- బీపీ పడిపోవడంతో పార్టీ నేతల్లో ఆందోళన
- రూ.15 వేల కోట్ల బకాయిలు చెల్లించాలంటూ డిమాండ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు



2



## ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలతో అభద్రతే

### విద్యార్థుల భవితను అపాయంలోకి నెట్టొద్దు

- రెండేళ్లకోసారి ఫైర్ ఎన్‌వోసీ రెన్యూవల్‌కు వెసులుబాటు
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్
- కాలేజీల యాజమాన్యాలకు హైడ్రా–ఇంటర్ బోర్డు దిశానిర్దేశం
- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు.. బ్రోకర్లను నమ్మొద్దన్న హైడ్రా

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అనుకోని అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు విద్యార్థులు, బోధనా సిబ్బంది సురక్షితంగా బయటపడేలా కాలేజీల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని హైడ్రా, ఇంటర్ బోర్డు సూచించాయి. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల వ్యవహారంలో హైడ్రా కేసులు నమోదు చేయడం, ఇంటర్ బోర్డు ఆయా కళాశాలలపై చర్యలు

........(తరువాయి 2లో)

## ఆ ఇద్దరితో పార్టీకి.. ప్రభుత్వానికి చెడ్డపేరు!

### కొండా సురేఖ, చిన్నారెడ్డిపై కఠిన చర్యలకు క్రమశిక్షణ సంఘం సిఫారసు

- వ్యక్తుల కంటే పార్టీ క్రమశిక్షణే ముఖ్యం
- సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించాలని చైర్మన్ మల్లు రవి ప్రతిపాదన
- చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ పదవి నుంచి తొలగించాలని సూచన
- గతంలో హెచ్చరించినా సురేఖ వైఖరిలో మార్పు లేదు
- అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుంది
- క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి



కాకతీయ,తెలంగాణ బ్యూరో : అధికార కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, బహిరంగ వ్యాఖ్యలపై పార్టీ నాయకత్వం కఠిన వైఖరి అవలంబించింది. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫారసు

........(తరువాయి 2లో)





## జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్ సస్పెన్షన్

- మంత్రి సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో దర్యాప్తు నిర్లక్ష్యమే కారణం
- ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం.. నిందితుడి అరెస్టులో విఫలమయ్యారన్న ఆరోపణలు
- రియల్టర్‌పై హత్యాయత్నం కేసులో సుమంత్ ప్రధాన నిందితుడు
- పోలీసుల తీరుపై విచారణకు సీపీ సజ్జనార్ ఆదేశాలు



కాకతీయ, తెలంగాణ బ్యూరో : మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ ఎన్. సుమంత్‌కు సంబంధించిన కేసులో జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌పై వేటు పడింది. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, కేసులో ప్రధాన

........(తరువాయి 2లో)

## మూసీ భూసేకరణ వేగవంతం చేయాలి



- ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలి
- మూసీ రివర్‌ఫ్రంట్ ఫేజ్-2కు త్వరలోనే టెండర్లు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూముల సేకరణపై మార్గదర్శకాలు
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

2

సింగరేణి బకాయిలు

## రూ.55 వేల కోట్లు చెల్లించాలి

- కొత్త బొగ్గు బ్లాకులతోనే సంస్థకు భవిష్యత్తు
- నైనీ, తాడిచర్ల-2, పీకేఓసీ-2పై చర్యలు తీసుకున్నాం
- సీఎం రేవంత్ అమెరికా పర్యటన వ్యాఖ్యలు అర్థరహితం
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి



3

అరవింద్ ధర్మపురి ఫౌండేషన్

## సేవలు ప్రశంసనీయం

- నిరుపేద చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం అభినందనీయం
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు సహకారం ప్రశంసనీయం
- సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలి
- తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



3

# 22ఏ భూములపై సమరం

(మొదటిపేజీ తరువాయి)

బాధితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని.. బీఆర్ఎస్ పార్టీ వారి తరపున అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**'ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలెందుకు తిరగాలి?'**

''ప్రజల భూములను 22ఏ జాబితాలో చేర్చడం ప్రభుత్వం చేసిన తప్పు. ఆ తప్పును సరిదిద్దుకోవడానికి దరఖాస్తుల పేరుతో సామాన్య ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఎందుకు తిరగాలి? లక్షలాది ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టి వారికి కంటి మీద కునుకు లేకుండా చేయడం ఏంటి? ప్రభుత్వం ప్రజలకు రక్షణగా ఉండాలి కానీ.. వాళ్ల ఆస్తుల విషయంలో ఇబ్బందులకు గురిచేయడం సరికాదు'' అని హరీశ్‌రావు అన్నారు. ''58 ఏళ్ల క్రితం ఏర్పడిన పద్మారావునగర్ ఫేజ్ 1, 1950ల నాటి స్ప్రింగ్‌ఫీల్డ్, నిజాంపేట్ వంటి కాలనీల్లోని దశాబ్దాల క్రితం నాటి పట్టా భూములను కూడా 22ఏలో చేర్చారు. ఇలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చడం తుగ్లక్ చర్య కాక మరేమిటి?'' అని ప్రశ్నించారు.

**'లంచాలు ఇస్తేనే పనులా?'**

ప్రభుత్వ కార్యాలయాల్లో పని కావాలంటే లంచాలు చెల్లించాల్సిందే అన్నట్లుగా పరిస్థితి తయారైందని హరీశ్‌రావు ఆరోపించారు. ''ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏజెంట్లు వసూళ్లకు దిగుతున్నారనే ఆరోపణలు బాధితుల నుంచి వస్తున్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీలో విల్లాకు, ఫ్లాట్‌కు రూ.30 వేల చొప్పున వసూలు చేస్తున్నారని బాధితులు బహిరంగంగానే చెబుతున్నారు. డబ్బులు ఇస్తేనే పని అవుతుందని వాపోతున్నారు'' అని అన్నారు. అమీన్‌పూర్‌కు చెందిన ఓ బాధితుడి పరిస్థితిని ప్రస్తావిస్తూ.. ''ఎంఆర్వో, ఆర్డీవో, కలెక్టర్ అంటూ కార్యాలయాల చుట్టూ తిప్పించుకుని.. చివరకు బయట బ్రోకర్లను కలిస్తేనే పని అవుతుందని పరోక్షంగా బెదిరిస్తున్నారు'' అని ఆరోపించారు.

**'కమీషన్ల కోసమే 22ఏ కుట్ర'**

''ఈ 22ఏ వ్యవహారం వెనుక భారీ కమీషన్ల బాగోతం దాగి ఉంది. దీనికి ఏ1 రేవంత్‌రెడ్డి, ఏ2 పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. 5050 కమీషన్ల కోసమే ఈ దోపిడీ జరుగుతోంది'' అని హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ''రేవంత్‌రెడ్డికి రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా తెలుసని చెబుతుంటారు. ఆ వ్యాపారం తెలిసిన వ్యక్తి ప్రజల కష్టాలు తీర్చాలి కానీ.. వారి రక్తం పీల్చి పిప్పి చేయడం ఏంటి?'' అని ప్రశ్నించారు. రాష్ట్రంలో హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతోపాటు చివరకు పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కులను కూడా అమ్మకానికి పెడుతున్నారని ఆరోపించారు. ''ఇలా అమ్ముకుంటూ పోతే రేపు గుడికో, బడికో.. చివరకు స్మశానవాటికకు కూడా భూమి మిగలదు'' అని అన్నారు.

**'సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి'**

22ఏ జాబితాలో భూములను ఎవరు చేర్చారో తేల్చాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ''భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారు? ఏ ప్రాతిపదికన చేర్చారు? దీనిపై సమగ్ర విచారణ జరగాలి. తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'' అని అన్నారు. నిషేధిత భూముల జాబితాను ప్రభుత్వం బహిరంగంగా అందుబాటులో ఉంచాలని కోరారు. ''22ఏ జాబితాను సీక్రెట్‌గా ఎందుకు ఉంచుతున్నారు? వెబ్‌సైట్‌లో జాబితాను ఎందుకు బ్లాక్ చేశారు? ప్రభుత్వం వెంటనే పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలి'' అని డిమాండ్ చేశారు.

**'అసెంబ్లీలో దద్దరిల్లేలా పోరాటం'**

''ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుంది. ప్రజల కష్టాలు ఎక్కడుంటే అక్కడ పార్టీ అండగా నిలబడుతుంది. సెప్టెంబరు 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే 22ఏ బాధితుల సమస్యలను సభలో ప్రధానంగా ప్రస్తావిస్తాం. అవసరమైతే సభను దద్దరిల్లేలా స్తంభింపజేసి అయినా బాధితులకు న్యాయం జరిగేలా కొట్లాడతాం'' అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజల భూములతో చెలగాటమాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ముఖ్యమంత్రి వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ జాబితాపై సమగ్ర విచారణ, పూర్తి వివరాలతో శ్వేతపత్రం, బాధితుల భూములకు పరిష్కారం లభించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

**'రాష్ట్రవ్యాప్తంగా సమస్య'**

22ఏ సమస్య హైదరాబాద్‌కే పరిమితం కాలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. "రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి ఎకరాల వ్యవసాయ భూములను కూడా 22ఏలో పెట్టారు. ఈ సమస్యపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి పెట్టాలి" అని డిమాండ్ చేశారు. మల్కాజిగిరిలో తాను 22ఏ భూముల సమస్యపై మాట్లాడినప్పుడు అక్కడికి వచ్చిన బాధితుల పేర్లు నమోదు చేసి వారి భూములను జాబితా నుంచి తొలగించారని తెలిపారు. తెలంగాణ భవన్‌కు వచ్చిన బాధితుల వివరాలు తీసుకున్న తర్వాత కూడా కొన్ని భూములను జాబితా నుంచి తొలగించారని చెప్పారు. "అంటే బీఆర్ఎస్ పోరాటం వల్లే ప్రభుత్వంలో ఈ మాత్రం కదలిక వచ్చింది" అని పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్ సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

నిందితుడిగా ఉన్న సుమంత్‌ను పట్టుకోవడంలో విఫలమయ్యారన్న ఆరోపణలపై ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తులో పోలీసుల తీరుపై విచారణకు కూడా సీపీ ఆదేశించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణపై దాడి కేసులో సుమంత్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం పరారీలో ఉన్నారు. కేసు నమోదు విషయంలో జాప్యం జరిగిందని, నిందితుడిని అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ కేసుకు సంబంధించి సుమంత్ డ్రైవర్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**రూ.10 కోట్లు డిమాండ్ చేశారంటూ ఫిర్యాదు**

బోడుప్పల్‌కు చెందిన రియల్టర్ గొంగిడి హరికృష్ణ ఫిర్యాదు మేరకు సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేసి రూ.10 కోట్లు డిమాండ్ చేశారని హరికృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారు. జులై 30న రాము కార్యాలయంలో కలవాలని సుమంత్ కోరారని, అక్కడికి వెళ్లిన తనను దుర్భాషలాడుతూ ఇనుప రాడ్‌తో దాడి చేశారని తెలిపారు. సుమంత్ ఆదేశాలతో మిగిలిన వారు కూడా తనపై దాడి చేశారని ఆరోపించారు. దాడిలో తన ఎడమ చేతికి ఫ్రాక్చర్ అయిందని, తీవ్ర రక్తస్రావంతో పాటు ఇతర గాయాలయ్యాయని హరికృష్ణ తెలిపారు. ఆగస్టు 10న శస్త్రచికిత్స చేయించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**తొలుత మేడిపల్లి పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్**

హరికృష్ణ ఫిర్యాదు ఆధారంగా మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో సుమంత్, రాము, ప్రశాంత్, అరుణ్‌కుమార్‌రెడ్డి, కార్తీక్, మహేందర్‌రెడ్డిలపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కేసును దర్యాప్తు నిమిత్తం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే కేసు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన తర్వాత దర్యాప్తు వేగంపై పలు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సుమంత్ ఇప్పటికీ పట్టుబడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, నిందితుడి అరెస్టులో వైఫల్యంపై ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**సుస్మిత వ్యాఖ్యల వివాదం వేళ కీలక పరిణామం**

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపాయి. ఈ వివాదం కొనసాగుతున్న సమయంలోనే మంత్రి మాజీ ఓఎస్డీ సుమంత్‌పై హత్యాయత్నం కేసు నమోదు కావడం, తాజాగా ఆ కేసు దర్యాప్తులో నిర్లక్ష్య ఆరోపణలతో జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్ సస్పెన్షన్‌కు గురికావడం చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తులో పోలీసుల తీరుపై సీపీ సజ్జనార్ ఆదేశించిన విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఆ ఇద్దరితో పార్టీకి.. ప్రభుత్వానికి చెడ్డపేరు!

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. సురేఖను మంత్రి పదవి నుంచి, చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ పదవి నుంచి తొలగించాలని సూచించినట్లు కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి మంగళవారం వెల్లడించారు. ఇద్దరి వ్యవహారశైలితో పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని కమిటీ భావించిందన్నారు. పార్టీకి నష్టం కలిగించే వ్యాఖ్యలను ఎంతటి వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీ తన పరిధిలో చేయాల్సిన ప్రక్రియను పూర్తి చేసి నివేదికను టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అందించిందని, తదుపరి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

**సురేఖకు పదవి ఎసరు!**

మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించాలని క్రమశిక్షణ కమిటీ స్పష్టంగా సిఫారసు చేసినట్లు మల్లు రవి తెలిపారు. ఆమె కుమార్తె కొండా సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వ్యవహారం మొదలైన విషయం తెలిసిందే. సుస్మిత వ్యాఖ్యలను మంత్రి సురేఖ ఖండించాల్సి ఉందని గతంలోనే మల్లు రవి పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసి, ఆమె వివరణ తీసుకున్న తర్వాతే కమిటీ తాజా నివేదిక రూపొందించింది. వనపర్తి రాజకీయాలపై చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించింది. తనకు కాకుండా డబ్బులకు ఆశపడి ఇతరులకు టికెట్లు ఇచ్చారని ఆయన చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదులు అందాయి. దీనిపై ఆయనకు కూడా కమిటీ నోటీసు ఇచ్చి వివరణ కోరింది. గతంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా పని చేసిన చిన్నారెడ్డి మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉందని మల్లు రవి వ్యాఖ్యానించారు.

**'వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యం'**

''కాంగ్రెస్‌లో వ్యక్తుల కంటే పార్టీ, క్రమశిక్షణే ముఖ్యం. పార్టీకి నష్టం కలిగించేలా ఎవరూ మాట్లాడకూడదు. నేతలు బాధ్యతగా వ్యవహరించాలి. పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఉపేక్షిస్తే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు వస్తాయి'' అని మల్లు రవి స్పష్టం చేశారు. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇద్దరు నేతలపై చర్యలు తీసుకోకపోతే పార్టీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని క్రమశిక్షణ కమిటీ అభిప్రాయపడినట్లు మల్లు రవి తెలిపారు. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా మాట్లాడటం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో నాయకులంతా సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాల్లో క్రమశిక్షణ కమిటీ తన పని పూర్తి చేసిందని మల్లు రవి తెలిపారు. ఇద్దరి వివరణలను పరిశీలించిన తర్వాతే నివేదికను రూపొందించినట్లు చెప్పారు. ఇక తుది నిర్ణయం ఏఐసీసీదేనన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ నివేదికను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లనున్నారని తెలిపారు. అక్కడి నుంచి అధిష్ఠానం నిర్ణయం వెలువడనుంది. ఇప్పటికే సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాలపై నోటీసులు, వివరణల దశ పూర్తవడంతో.. పదవుల నుంచి తొలగించాలని క్రమశిక్షణ కమిటీ చేసిన సిఫారసుపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## మూసీ భూసేకరణ వేగవంతం చేయాలి

- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



**కాకతీయ, హైదరాబాద్:** మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధిపై నిర్వహించిన సమావేశంలో ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. భూసేకరణలో ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని సూచించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూముల సేకరణకు మార్గదర్శకాలు రూపొందించి, భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రివర్‌ఫ్రంట్ ఫేజ్ 2కు త్వరగా టెండర్లు పిలవాలని సూచించారు. ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రుణాలు పొందేలా చర్యలు తీసుకోవాలని, పురోగతిపై వారానికోసారి సమీక్ష నిర్వహించాలని చెప్పారు. గండిపేటమంచిరేవుల సమీపంలోని ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి టెండర్లు పిలవాలని, కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు ప్రచారం కల్పించాలని ఆదేశించారు.

## ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూపీఆర్ఎస్ రిపోర్టులు చెంపపెట్టు!

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్నాళ్లుగా చేస్తున్న ప్రచారానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అఫిడవిట్, కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ నివేదికలు చెంపపెట్టు వంటివని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం మొత్తం కుప్పకూలిందని, ప్రాజెక్టు పనికిరాదని, నీటిని ఎత్తలేమంటూ చేసిన ప్రచారం ఒక్కొక్కటిగా పటాపంచలవుతోందని పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేసుకోవచ్చని ఎన్‌డీఎస్ఏ అఫిడవిట్‌లో స్పష్టం చేసిందని తెలిపారు. అన్నారం, సుందిళ్లలోని ఏ బ్లాక్‌లోనూ నిర్మాణపరమైన సమస్యలు లేవని, కాంక్రీట్ నాణ్యత కూడా బాగుందని సీడబ్ల్యూపీఆర్ ఎస్ పరిశీలనలో తేలిందని వెల్లడించారు.

**నీటిని కిందికి వదిలేస్తున్నారు**

కాళేశ్వరంపై రాజకీయ కక్షతో ప్రాజెక్టును పక్కనపెట్టి, తెలంగాణకు వచ్చిన గోదావరి నీటిని వినియోగించుకోకుండా కిందికి వదిలేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని హరీశ్ రావు విమర్శించారు. ప్రాజెక్టును నిందిస్తూ నీటిని లిఫ్ట్ చేయకుండా ఏపీకి వదిలేయడం ద్వారా తెలంగాణ రైతాంగానికి తీరని నష్టం చేశారని ఆరోపించారు. విపక్షాలు నిలదీసిన తర్వాతే ఆలస్యంగా దేవాదుల, నంది పంపులను ఆన్ చేశారని, అప్పటికే వరద నీరంతా కిందికి వెళ్లిపోయిందన్నారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు ఆలస్యంగా పంపులు ఆన్ చేసి.. ఆ తర్వాత వెంటనే ఆఫ్ చేశారని విమర్శించారు. ''ఏపీకి నీళ్లు వదిలారు.. తెలంగాణ రైతులకు కన్నీళ్లు మిగిల్చారు'' అని అన్నారు. దేశవ్యాప్తంగా జలాశయాల్లో నీటి నిల్వలు సగటున 64.16 శాతం ఉండగా.. తెలంగాణలో మాత్రం 35.6 శాతం మాత్రమే ఉన్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. దేశ సగటుతో పోలిస్తే తెలంగాణ జలాశయాల్లో నీటి నిల్వలు సగానికి చేరువలో ఉండటం ఆందోళనకరమన్నారు. ఇవి కేవలం గణాంకాలు కాదని.. రాబోయే నీటి సంక్షోభానికి సంకేతాలని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో నీటి నిర్వహణలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ.. ఇప్పుడు జలాశయాల్లో నీటి నిల్వల విషయంలో బీహార్‌తో పోటీ పడే పరిస్థితికి చేరిందని విమర్శించారు. ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, నీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. కేసీఆర్ హయాంలో నీటి కొరతను అధిగమించిన తెలంగాణను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ నీటి కష్టాల్లోకి నెట్టిందని ఆరోపించారు.

**రాజకీయ కక్షలు పక్కనపెట్టాలి**

కమిషన్లు వేయడం, విచారణలు చేయడంపై ఉన్న శ్రద్ధ.. కిందికి పోతున్న గోదావరి, కృష్ణా జలాలను ఒడిసిపట్టి రైతులకు అందించడంలో ఎందుకు లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని విపక్షాలు, ఇంజినీర్లు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ''ఇది రాజకీయ కక్షలకు సమయం కాదు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడాల్సిన సమయం'' అని స్పష్టం చేశారు. పార్టీలో కుమ్ములాటలు, కొట్లాటలపై శ్రద్ధ పక్కనపెట్టి ప్రాజెక్టుల నిర్వహణ, నీటి హక్కులు, రైతుల ప్రయోజనాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం మానుకుని అన్నారం, సుందిళ్ల మోటార్లు ఆన్ చేసి గోదావరి నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నీటిని రైతుల పొలాలకు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పక్షాన కోరారు.

## ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలతో అభద్రతే

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటున్న నేపథ్యంలో కాలేజీల యాజమాన్యాలతో హైడ్రా, ఇంటర్ బోర్డు సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలతో విద్యార్థుల భద్రతను ప్రమాదంలోకి నెట్టొద్దని స్పష్టం చేశాయి. కాలేజీల్లో విద్యార్థుల భద్రతకు అనుగుణంగా ఏమైనా మార్పులు, చేర్పులు అవసరమైతే వెంటనే చేపట్టాలని అధికారులు సూచించారు. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలు పొందడానికి గల కారణాలను యాజమాన్యాలను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అధికారుల బృందం తెలుసుకుంది. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల పేరుతో కాలేజీల యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని అధికారులు స్పష్టం చేశారు. కాలేజీల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు ప్రతి ఏడాది కాకుండా రెండేళ్లకోసారి ఫైర్ ఎన్‌వోసీ రెన్యూవల్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కాలేజీల్లో రెండో స్టైర్‌కేస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత భవనాల్లో రెండో స్టైర్‌కేస్‌కు అవకాశం లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని సూచించారు.

**ఆన్‌లైన్‌లోనే ఫైర్ ఎన్‌వోసీ**

ఫైర్ ఎన్‌వోసీలు, వాటి రెన్యూవల్స్ కోసం హైడ్రా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని ఏవీ రంగనాథ్ సూచించారు. బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఫైర్ ఎన్‌వోసీల జారీ ప్రక్రియను సరళతరం చేశామని, దరఖాస్తుల స్వీకరణ, అనుమతుల మంజూరు, పాత అనుమతుల పునరుద్ధరణ, ఫీజుల చెల్లింపులు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యాజమాన్యాలు కూడా ఇదే విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫైర్ ఎన్‌వోసీ కోసం హైడ్రా కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు.

**నకిలీ ఎన్‌వోసీలపై లోతైన విచారణ**

ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరనే దానిపై లోతైన విచారణ కొనసాగుతోందని హైడ్రా కమిషనర్ తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు తమ ఫైర్ ఎన్‌వోసీలు అసలైనవా? కాదా? అనే విషయాన్ని స్వయంగా సరిచూసుకోవాలని సూచించారు. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించిన కళాశాలలకు విధించిన రూ.8 లక్షల అపరాధ రుసుము విషయంలో పునరాలోచన చేస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీలను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని ఇరు శాఖల అధికారులు స్పష్టం చేశారు. సమావేశంలో హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య ఫైర్ నిబంధనలను వివరించారు. ఇంటర్ బోర్డు సంయుక్త కార్యదర్శి వసుంధర సమావేశ వివరాలను వెల్లడించారు.

## ఫీజు బకాయిలపై దీక్ష.. రెండో రోజే విరమణ

- ఆరోగ్యం క్షీణించడంతో రాంచందర్‌రావు దీక్షకు బ్రేక్
- బీపీ పడిపోవడంతో పార్టీ నేతల్లో ఆందోళన
- రూ.15 వేల కోట్ల బకాయిలు చెల్లించాలంటూ డిమాండ్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**కాకతీయ, హైదరాబాద్ :** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్ష రెండో రోజే ముగిసింది. ఆరోగ్యం క్షీణించి రక్తపోటు (బీపీ) గణనీయంగా పడిపోవడంతో పార్టీ సీనియర్ నేతల సూచన మేరకు ఆయన దీక్షను విరమించారు. సోమవారం ప్రారంభమైన దీక్ష మంగళవారం సాయంత్రం వరకు కొనసాగాల్సి ఉండగా.. ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మధ్యలోనే ముగించాల్సి వచ్చింది. దీక్షా శిబిరానికి వచ్చిన బీజేపీ సీనియర్ నేత, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ రాంచందర్‌రావుకు నిమ్మరసం అందించి దీక్ష విరమించాలని సూచించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు దీక్షకు సంఘీభావం తెలిపారు. దీక్ష విరమించే ముందు రాంచందర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో దాదాపు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. సుమారు 40 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యార్థుల సమస్యలను పట్టించుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. యువతకు తామే సంరక్షకులమని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ మాటలకు, చేతలకు పొంతన లేదన్నారు. తెలంగాణ యువత మేల్కొందని, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

**విద్యావ్యవస్థ సంక్షోభంలోకి**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల రాష్ట్ర విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని రాంచందర్‌రావు ఆరోపించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రాంచందర్‌రావు ఆరోగ్యం క్షీణించడంతో దీక్షను విరమించినప్పటికీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగించాలని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.



# ఫీజు బకాయిలు చెల్లించండి లేదంటే మరో ఉద్యమమే!

(మొదటిపేజీ తరువాయి)

పట్టించుకోవడం లేదని విమర్శించారు. భూముల అమ్మకాల ద్వారా వేల కోట్ల రూపాయలు సమకూరుతున్నా.. పేద విద్యార్థుల ఫీజులు చెల్లించేందుకు ప్రభుత్వానికి మనసు రావడం లేదా అని ప్రశ్నించారు. బకాయిలు వెంటనే విడుదల చేయకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా పొరపాటున రేవంత్‌రెడ్డికి ఓటు వేశామని ప్రజలు బాధపడుతున్నారని ఈటల పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలే రేవంత్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ''రేవంత్ మా పార్టీలోకి ఉడుం లెక్క చేరిండు.. మరో 20 ఏళ్లు కాంగ్రెస్‌ను రాష్ట్రంలో అధికారంలోకి రాకుండా చేశాడు'' అని ఆ పార్టీ కార్యకర్తలు అంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని విమర్శించారు.

**ఫీజులు చెల్లించకపోతే పిల్లలు ఏం కావాలి?**

పేదలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని ఈటల రాజేందర్ అన్నారు. కూలి చేసుకునే వారు, ఆటోలు నడిపేవారు, కూరగాయలు అమ్ముకునే వారి పిల్లలు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నమ్మకంతో కళాశాలల్లో చేరారని చెప్పారు. చదువులో చేరిన తర్వాత ఫీజులు చెల్లించబోమంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎటు వెళ్లాలని ప్రశ్నించారు. బకాయిలు రాక కళాశాలలు సిబ్బంది జీతాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఈటల ఆరోపించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందని, వారి ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

**విదేశీ యూనివర్సిటీలతో ప్రయోజనమేంటి?**

తెలంగాణలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ క్యాంపస్, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ క్యాంపస్‌లు ఏర్పాటు చేసినంత మాత్రాన రాష్ట్రం బాగుపడదని ఈటల అన్నారు. తెలంగాణలో చదువుకున్నవారే ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత స్థానాలకు ఎదిగారని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి శాంతను నారాయణ్ అడోబ్ సీఈవోగా, సుందర్ పిచాయ్ గూగుల్ సీఈవోగా, సత్య నాదెళ్ల మైక్రోసాఫ్ట్ సీఈవోగా ఎదిగారని గుర్తుచేశారు. అరవింద్ కృష్ణ, రవికుమార్, అజయ్ బంగా, ఇంద్రా నూయి, వివేక్ మూర్తి, రాజ్ సుబ్రహ్మణ్యం తదితరులు భారతదేశంలో చదువుకున్న వారేనన్నారు. స్కైరూట్ వంటి సంస్థల ద్వారా ఆకాశాన్ని జయిస్తున్నది కూడా తెలంగాణ యువతేనని చెప్పారు. విద్యతోనే సమానత్వం సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారని, దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని కొఠారి పేర్కొన్నారని ఈటల గుర్తుచేశారు. విద్యార్థుల మేధస్సు వికసిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విశ్వసించారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి వారి ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

**మెడలు వంచాల్సిన సమయం వచ్చింది**

రాష్ట్ర ముఖ్యమంత్రి నాలుగు కోట్ల మంది ప్రజలకు తల్లిదండ్రి లాంటి వారని ఈటల అన్నారు. ఆ బాధ్యతను రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారని విమర్శించారు. ''ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తోలుమందం అయ్యింది. మెడలు వంచాల్సిన సమయం వచ్చింది'' అని వ్యాఖ్యానించారు. రైతుబంధు అందక 60 లక్షల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు, తల్లిదండ్రులు, ఆటోడ్రైవర్లు తదితర వర్గాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో పేదలు, కార్మికులు, రైతుల పిల్లలు కూడా ఉన్నతంగా చదువుకోవాలన్నదే బీజేపీ పోరాటమని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వసూలు చేసే వరకు వెనక్కి తగ్గేది లేదన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి తనకు అనుకూలంగా పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని ఈటల ఆరోపించారు. అయితే ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని విమర్శించారు. ''సోయి లేని ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ సమాజం సిగ్గుతో తలదించుకుంటోంది'' అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలోని బకాయిలు చెల్లించబోమని చెప్పడం సరికాదని అన్నారు. పార్టీలు వస్తాయి.. పోతాయి.. ప్రభుత్వాలు శాశ్వతమని, సంక్షేమ పథకాలు కొనసాగుతాయనే బాధ్యత ప్రభుత్వానికి ఉండాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశామని చెబుతున్న ప్రభుత్వం.. బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీజేపీ తరపున డిమాండ్ చేస్తున్నామని, మరో ఉద్యమం చేసే పరిస్థితి రాకముందే ప్రభుత్వం స్పందించాలని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# నకిలీ క్యాటరింగ్ కాంట్రాక్టులతో కుచ్చుటోపీ

- ఐటీ కంపెనీ ప్రతినిధినంటూ నమ్మించి లక్షల్లో వసూళ్లు
- అగ్రిమెంట్, రిజిస్ట్రేషన్ పేరుతో డబ్బులు బదిలీ చేయించుకుని మాయం
- హాస్టల్ యజమానులను మోసం చేసిన నిందితుడు
- 23 కేసులు, 6 సైబర్ ఫిర్యాదుల్లో నిందితుడి ప్రమేయం
- రూ.36.99 లక్షల మోసం.. రూ.13.09 లక్షలు హోల్డ్ చేసి నిందితుడి అరెస్ట్
- వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత




కాకతీయ, వరంగల్ బ్యూరో : నకిలీ క్యాటరింగ్ కాంట్రాక్టులు, ఆహార సరఫరా అవకాశాల పేరుతో హాస్టల్ యజమానులను మోసం చేస్తున్న అంతర్‌జిల్లా సైబర్ నిందితుడిని హన్మకొండ పోలీసులు అరెస్ట్ చేసినట్లు వరంగల్ సీపీ శ్వేత తెలిపారు. ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధినంటూ పరిచయం చేసుకుని.. ఆ సంస్థ ఉద్యోగులకు ఆహారం సరఫరా చేసే క్యాటరింగ్ కాంట్రాక్టులు ఇప్పిస్తానని నమ్మించి పలువురి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు వెల్లడించారు. హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో నిందితుడి మోసం వెలుగులోకి వచ్చిందని, తదుపరి దర్యాప్తులో తెలంగాణలోని పలు జిల్లాల్లో నమోదైన కేసుల్లోనూ అతడి ప్రమేయం గుర్తించినట్లు సీపీ శ్వేత తెలిపారు. హాస్టళ్ల బోర్డులపై ఉన్న మొబైల్ నంబర్లను సేకరించి నిందితుడు యజమానులను సంప్రదించేవాడని సీపీ శ్వేత తెలిపారు. తాను ప్రముఖ కంపెనీలో ఉద్యోగినని, లేదంటే ఆ సంస్థ ప్రతినిధినని చెప్పి క్యాటరింగ్ కాంట్రాక్టులు ఇప్పిస్తానని నమ్మించేవాడన్నారు. అనంతరం అగ్రిమెంట్ ఛార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజు, క్యాటరింగ్ సామగ్రి కొనుగోలు, ఇతర ఖర్చుల పేరుతో బ్యాంకు ఖాతాలు, యూపీఐ ఖాతాలకు డబ్బులు బదిలీ చేయించుకునేవాడని వివరించారు. డబ్బులు అందిన తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం లేదా నంబర్ మార్చి బాధితులకు అందుబాటులో లేకుండా పోయేవాడని చెప్పారు. కొన్ని సందర్భాల్లో ఇతరుల యూపీఐ ఖాతాలను ఉపయోగించి అవి కంపెనీ సిబ్బందికి చెందిన ఖాతాలని నమ్మించి డబ్బులు బదిలీ చేయించుకున్నట్లు దర్యాప్తులో గుర్తించామన్నారు. వసూలు చేసిన మొత్తంలో కొంత వ్యక్తిగత అవసరాలకు, మరికొంత ఆన్‌లైన్ గేమింగ్‌లో వినియోగించినట్లు వెల్లడైందని తెలిపారు.

### పలు జిల్లాల్లో కేసులు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిందితుడి ప్రమేయం ఉన్న 10 కేసులను గుర్తించామని సీపీ శ్వేత తెలిపారు. ఖమ్మం, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల్లో మరో ఏడు కేసుల్లో అతడి పాత్ర ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటివరకు నమోదైన కేసుల్లో రూ.33,33,950 నష్టం జరిగినట్లు గుర్తించగా.. రూ.12,40,657 మొత్తాన్ని హోల్డ్ చేసినట్లు వెల్లడించారు. ఎఫ్ఐఆర్‌లు నమోదు కాకుండా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదైన మరో ఆరు ఫిర్యాదుల్లో రూ.3,65,050 నష్టం జరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఇందులో రూ.68,430 మొత్తాన్ని హోల్డ్ చేశామన్నారు. కేసులు, సైబర్ ఫిర్యాదులు కలిపి మొత్తం రూ.36,99,000 మోసం జరిగినట్లు గుర్తించగా.. రూ.13,09,087 మొత్తాన్ని హోల్డ్ చేసినట్లు సీపీ శ్వేత పేర్కొన్నారు.

### మూడు ఫోన్లు, సిమ్ కార్డులు స్వాధీనం

నిందితుడిని మహమ్మద్ షబ్బీర్ అలియాస్ కిరణ్‌కుమార్ అలియాస్ శ్రీకాంత్‌రెడ్డి అలియాస్ నర్సింహారెడ్డిగా గుర్తించినట్లు సీపీ తెలిపారు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి గ్రామానికి చెందిన అతడు ప్రస్తుతం హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ రామ్‌రెడ్డి నగర్‌లో నివసిస్తూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. అతడి వద్ద నుంచి మూడు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, రెండు బ్యాంకు పాస్‌బుక్స్, ఒక చెక్‌బుక్, రెండు ఏటీఎం కార్డులు, ఒక డైరీ స్వాధీనం చేసుకున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. హన్మకొండ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కేసును దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు.

### కంపెనీ పేరుతో ఫోన్ వస్తే అప్రమత్తంగా ఉండాలి

క్యాటరింగ్ కాంట్రాక్టులు, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే అప్రమత్తంగా ఉండాలని సీపీ శ్వేత సూచించారు. కంపెనీ పేరు చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే.. సంబంధిత సంస్థ అధికారిక ఫోన్ నంబర్లు, అధికారిక వనరుల ద్వారా వివరాలను స్వతంత్రంగా నిర్ధారించుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అగ్రిమెంట్, రిజిస్ట్రేషన్, అడ్వాన్స్, సామగ్రి కొనుగోలు వంటి పేర్లతో గుర్తుతెలియని వ్యక్తులు సూచించిన బ్యాంకు ఖాతాలు లేదా యూపీఐలకు డబ్బులు బదిలీ చేయవద్దని హెచ్చరించారు. ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, బ్యాంకు వివరాలు వంటి రహస్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి, లావాదేవీల వివరాలు, మొబైల్ నంబర్లు, సందేశాలు, చెల్లింపు రసీదులు వంటి ఆధారాలను భద్రపరచుకోవాలని సీపీ శ్వేత సూచించారు.

కార్మికులు, ఉద్యోగులకు

## పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

- వేతన సంఘం గడువు దాటినా కాలయాపన ఎందుకు?
- మున్సిపల్ కార్మికుల వేతనాల్లో కోత విధించొద్దు
- రూ.26 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్
- జి. రామయ్య, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి




కాకతీయ, ఖమ్మం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులకు పీఆర్సీని వెంటనే ప్రకటించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ఏ. వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ రంగాల కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని రామయ్య ఆరోపించారు. పీఆర్సీ గడువు ముగుస్తున్నా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. వెంటనే పీఆర్సీ ప్రకటించి ఉద్యోగులు, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికుల వేతనాలను తగ్గిస్తూ జూలై 15న రాష్ట్ర ప్రభుత్వం ఎండార్స్‌మెంట్ విడుదల చేసిందని రామయ్య ఆరోపించారు. తాజా ఎండార్స్‌మెంట్ కారణంగా మున్సిపాలిటీ డ్రైవర్లు, పంప్ ఆపరేటర్లు, డేటా ఆపరేటర్లు, అటెండర్లకు ప్రస్తుతం అందుతున్న వేతనాల్లో రూ.1,000 నుంచి రూ.3,000 వరకు కోత పడే పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఇది మున్సిపల్ కార్మికుల పొట్టకొట్టడమేనని విమర్శించారు.

### వేతనాలు పెంచాల్సింది పోయి తగ్గిస్తారా?

నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత వేతనాలు సరిపోక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని రామయ్య అన్నారు. వేతన సంఘం సిఫారసు చేసిన రూ.26 వేల వేతనం అమలు చేయాల్సింది పోయి వేతనాల్లో కోత విధించడం సరికాదన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మున్సిపల్, గ్రామపంచాయతీ, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో పాటు ఇతర రంగాల కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తాజా నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోకపోతే భవిష్యత్‌లో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సెప్టెంబర్ 6న ఖమ్మంలో నిర్వహించనున్న టీయూసీఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు సి.వై. పుల్లయ్య, కొయ్యల శ్రీనివాస్, ఎలదండి బాబు, జిల్లా సహాయ కార్యదర్శులు డి. శ్రీనివాసరావు, ఆవుల అశోక్, జిల్లా కోశాధికారి శరత్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి

- మొక్కలు నాటి సంరక్షించడం అందరి బాధ్యత
- ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను పెంచాలి
- పచ్చదనంతోనే ఆరోగ్యకరమైన వాతావరణం
- జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపు

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి : వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇల్లందు క్రాస్‌రోడ్‌లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు అందించి సంరక్షించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి వృక్షంగా ఎదిగే వరకు బాధ్యతగా పెంచాలన్నారు. విద్యార్థులు ఇళ్ల వద్ద, పాఠశాలల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు.

## గిరిజన సంక్షేమ శాఖలో శ్రీనివాసుడి లీలలు

- నచ్చితేనే ఫైల్ క్లియర్.. అన్ని అర్హతలున్నా క్లియరెన్స్‌కు వేధింపులు
- నిబంధనలతో పనిలేకుండా అధికారి వ్యవహారం
- రాజకీయ అండదండలున్నాయంటూ డిపార్ట్‌మెంట్‌లో హల్‌చల్
- సార్ సర్టిఫైడ్ కోసం నెలలుగా వేచి చూస్తున్న ఉద్యోగుల ఫైళ్లు
- బిల్లుల క్లియరెన్స్‌కు బ్రోకర్లతో వెళ్తేనే పని పూర్తయ్యేది..!
- గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో చక్రం తిప్పుతున్న అధికారి




కాకతీయ, తెలంగాణ బ్యూరో : గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయంలో ఓ అధికారి వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది. నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు ఉన్నప్పటికీ కొన్ని ఫైళ్లను కొర్రీల పేరుతో పెండింగ్‌లో పెడుతున్నారని ఉద్యోగులు, సంబంధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. తనకు నచ్చిన ఫైళ్లను మాత్రమే వేగంగా క్లియర్ చేస్తూ.. మిగిలిన వాటిని నెలల తరబడి తిప్పుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 'సార్ సర్టిఫైడ్' కోసం ఉద్యోగులు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందన్న ఆరోపణలు శాఖలో హాట్‌టాపిక్‌గా మారాయి. శాఖలో ఉద్యోగులు, క్షేత్రస్థాయి అధికారులు తమకు సంబంధించిన బిల్లులు, సర్వీస్ వ్యవహారాలు, ఇతర పరిపాలనాపరమైన ఫైళ్లను నిబంధనల ప్రకారం సిద్ధం చేసి ఉన్నతాధికారుల అనుమతి కోసం పంపుతుంటారు. అయితే కొన్ని ఫైళ్ల విషయంలో చిన్నచిన్న కారణాలు చూపుతూ వాటిని వెనక్కి పంపుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఒకసారి చెప్పిన లోపాన్ని సరిచేసి మళ్లీ పంపినా మరో కారణంతో కొర్రీ పెట్టడం, ఇలా ఫైళ్లను రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులు, అధికారులు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలుస్తోంది. నిబంధనల్లో స్పష్టత ఉన్న అంశాల్లోనూ సొంత నిర్ణయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### మధ్యవర్తుల ద్వారా వస్తేనేనా?

బిల్లుల క్లియరెన్స్ విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు, ధ్రువపత్రాలు సమర్పించినప్పటికీ నేరుగా వచ్చిన ఫైళ్లపై ఆలస్యం చేస్తున్నారని.. మధ్యవర్తులు, బ్రోకర్ల ద్వారా సంప్రదించిన తర్వాతే పనులు సులువుగా పూర్తవుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. ఏ ఫైలు ఎప్పుడు వచ్చింది? ఎన్ని రోజులు పెండింగ్‌లో ఉంది? ఏ కారణంతో కొర్రీ పెట్టారు? తిరిగి సమర్పించిన తర్వాత ఎంత సమయంలో క్లియర్ చేశారు? అన్న వివరాలను ఫైల్ మూవ్‌మెంట్ రికార్డుల ద్వారా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### రాజకీయ అండ ఉందా?

సదరు అధికారికి రాజకీయ అండదండలు ఉన్నాయన్న ప్రచారం కూడా శాఖలో జరుగుతోంది. అందువల్లే ఉన్నతాధికారుల స్థాయిలోనూ ఆయన వ్యవహారశైలిపై పెద్దగా చర్యలు ఉండటం లేదన్న చర్చ ఉద్యోగుల్లో సాగుతోంది. రాజకీయ పలుకుబడి లేకపోతే ఇంతకాలం ఒకే అధికారి కార్యాలయంలో చక్రం తిప్పడం ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్నలు మాత్రం వినిపిస్తున్నాయి. కమిషనర్ కార్యాలయంలో ఫైళ్ల పరిష్కారానికి స్పష్టమైన గడువు ఉన్నప్పటికీ.. ఆచరణలో మాత్రం ఆలస్యం జరుగుతోందన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సార్ సర్టిఫైడ్, బిల్లుల క్లియరెన్స్, ఉద్యోగుల సర్వీస్ ఫైళ్లను ప్రత్యేకంగా పరిశీలిస్తే ఎక్కడ ఆలస్యం జరుగుతోందో తేలే అవకాశం ఉంది. గత కొన్ని నెలల్లో సదరు అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల సంఖ్య, వాటిలో ఎన్ని క్లియర్ అయ్యాయి, ఎన్ని తిరస్కరించారు, ఎన్ని కొర్రీలతో వెనక్కి పంపారు అనే వివరాలను బయటకు తీస్తే అసలు వ్యవహారం స్పష్టమవుతుందని ఉద్యోగులు చెబుతున్నారు. ఆరోపణలు నిరాధారమైతే రికార్డులతో వాటిని ఖండించాలి.. నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి అని శాఖ వర్గాలు కోరుతున్నాయి. మొత్తంగా గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయంలో సాగుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా ఫైళ్ల పరిష్కారానికి పారదర్శక విధానం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

## సింగరేణి బకాయిలు రూ.55 వేల కోట్లు చెల్లించాలి

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి



కాకతీయ, న్యూఢిల్లీ : సింగరేణి సంస్థను ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేసి బలోపేతం చేయాలంటే కొత్త బొగ్గు బ్లాకులను సాధించుకోవడంతో పాటు దుబారా ఖర్చులను తగ్గించాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు రూ.55 వేల కోట్ల బకాయిలను త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దిల్లీలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణికి కొత్త బొగ్గు గనులు కేటాయించే విషయంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి యాదాద్రి పవర్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా అయ్యేలా ఒప్పందం కుదిరిందన్నారు. తాడిచర్ల–2, మణుగూరు పీకేఓసీ–2 బ్లాకులు సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కోయ గూడెం– 3 బ్లాక్‌ను కూడా సింగరేణికి దక్కేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సింగరేణి ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉందని, ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకొచ్చి ఉద్యోగులకు జీతాలు చెల్లించే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించి సంస్థను ఆదుకోవాలని కోరారు. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి విషయంలో చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని విమర్శించారు. విదేశీ పర్యటనలకు అనుమతులు ఇవ్వడం వెనుక పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. కుల గణనలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని కూడా కిషన్‌రెడ్డి ఆరోపించారు.

జాతీయ స్థాయి ఫొటోగ్రఫీలో

## హరీష్‌కు అవార్డు

- ఏపీ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీ
- మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ చేతుల మీదుగా హరీష్‌కు అవార్డు




కాకతీయ, విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీలో అవార్డుకు ఎంపికైన చిత్రానికి ఫొటో జర్నలిస్ట్ హరీష్ పురస్కారం అందుకున్నారు. మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ చేతుల మీదుగా హరీష్ అవార్డు స్వీకరించారు. జాతీయ స్థాయి పోటీలో తన చిత్రం అవార్డుకు ఎంపిక కావడం పట్ల హరీష్ సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిజంలో ఫొటోగ్రఫీకి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ నిర్వహించే ఇలాంటి పోటీలు ఫొటో జర్నలిస్టుల్లో మరింత సృజనాత్మకతను పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అవార్డు అందుకున్న హరీష్‌ను పలువురు జర్నలిస్టులు, సహచరులు అభినందించారు.

అరవింద్ ధర్మపురి ఫౌండేషన్

## సేవలు ప్రశంసనీయం

- నిరుపేద చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం అభినందనీయం
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు సహకారం ప్రశంసనీయం
- సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలి
- తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

కాకతీయ, నిజామాబాద్ : ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలుస్తున్న అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ (ఏడీఎఫ్) సేవలు ప్రశంసనీయమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. నిజామాబాద్‌లో మంగళవారం అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పసిపిల్లల కుటుంబాలకు ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించి, లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నిరుపేద చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఫౌండేషన్ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని అన్నారు. 'వసుధైవ కుటుంబకం' స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని గవర్నర్ సూచించారు. లబ్ధిదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలతో వారిని అనుసంధానం చేయాలని ఫౌండేషన్‌కు సూచించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు, ప్రజలు సమష్టిగా పనిచేస్తే అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎంపీ ధర్మపురి అరవింద్‌ను గవర్నర్ అభినందించారు. ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అరవింద్ వివరించారు. పసిపిల్లల కుటుంబాలకు ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమానికి హాజరైన గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పి. రాకేశ్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎనుమాముల మార్కెట్

## రూపురేఖలు మారనున్నాయా?!

- ఫ్రూట్, ఫ్లవర్ మార్కెట్లకు భారీగా భూసేకరణ
- రైతులు, వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కీలక తీర్మానాలు
- మార్కెట్‌లో పోలీస్ స్టేషన్, పీహెచ్‌సీ ఏర్పాటుకు భూమి
- ఎనుమాముల మార్కెట్ ఛైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక నేతృత్వంలో కీలక నిర్ణయాలు

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కీలక అడుగులు పడుతున్నాయి. రైతులు, వ్యాపారుల చిరకాల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా మార్కెట్ కమిటీ పాలకవర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫ్రూట్, ఫ్లవర్ మార్కెట్ల ఏర్పాటు సహా పలు అంశాలపై తీర్మానాలు చేశారు. పండ్ల మార్కెట్ ఏర్పాటు కోసం 30 ఎకరాలు, హనుమకొండలో పూల మార్కెట్ కోసం 10 ఎకరాల భూసేకరణ చేపట్టాలని నిర్ణయించారు. మార్కెట్ భద్రత, రైతులకు మెరుగైన సేవల కోసం సొంతంగా పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు భూమి కేటాయించాలని తీర్మానించారు. ఎనుమాములతో పాటు పర్వతగిరి, షోడశాపల్లి సబ్‌యార్డుల్లో కొత్త గోదాముల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. ముసలమ్మకుంట నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డుకు భూమి అప్పగింత, 1993లో నిర్మించిన లక్ష్మీపురం గ్రెయిన్ మార్కెట్ టవర్‌కు మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని తీర్మానించారు. తూర్పు ఎమ్మెల్యే సిఫారసుతో 158 రిటైల్ ప్లాట్ల అద్దెలను తగ్గించడంతో పాటు పాత బకాయిల మాఫీకి ప్రతిపాదన చేయాలని నిర్ణయించారు. లక్ష్మీపురం, ఎనుమాములలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, గేట్–2 వద్ద జి+1 కమర్షియల్ షాపుల నిర్మాణం, ఎక్సైజ్ కాలనీ రైతుబజార్‌ను ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టాలని తీర్మానించారు.

### సిబ్బంది, భద్రతకు ప్రాధాన్యం

మార్కెట్ నిర్వహణను మరింత పటిష్ఠం చేసేందుకు 30 మంది డీఈవోలు, 30 మంది సెక్యూరిటీ గార్డులను నియమించాలని నిర్ణయించారు. మార్కెట్ యార్డులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, గొర్రెకుంట గోదాంకు రహదారి నిర్మాణం తదితర అంశాలపైనా పాలకవర్గం తీర్మానాలు చేసింది. అనంతరం ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందిన డీఎంవో సురేఖకు మార్కెట్ పాలకవర్గం, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ బండి జనార్దన్, పాలకవర్గ సభ్యులు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.25 కోట్ల విలువైన 251 కిలోల గంజాయి స్వాధీనం

**అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్**
**ద్విచక్ర వాహనం, రూ.9 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం**
**ఒడిశా నుంచి తెచ్చి పలు రాష్ట్రాల్లో విక్రయిస్తున్నట్లు గుర్తింపు**
**వివరాలు వెల్లడించిన వరంగల్ పోలీస్ కమిషనర్**



కాకతీయ, వరంగల్ బ్యూరో : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది. అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని దామెర పోలీసులు అరెస్ట్ చేసి, అతడి నుంచి సుమారు రూ.1.25 కోట్ల విలువైన 251 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రూ.9 వేల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన ముదిగొండ నాగేశ్వర్‌రావు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. తనకున్న నెట్‌వర్క్ ద్వారా ఒడిశాకు చెందిన రమేష్, సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలువురికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న దామెర పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో గంజాయి కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన కీలక వివరాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో అతడి ఇంట్లో నిల్వ ఉంచిన భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

### ఇతర నిందితుల కోసం గాలింపు

గంజాయి సరఫరా నెట్‌వర్క్‌లో ఉన్న ఇతర నిందితులను కూడా పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మరికొందరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా కాపాడటంతో పాటు గంజాయి అక్రమ విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పోలీస్ కమిషనర్ తెలిపారు. గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసీపీ సతీష్‌బాబు, శాయంపేట సీఐ సుధాకర్‌రెడ్డి, దామెర ఎస్ఐ వీరభద్రరావు, శాయంపేట ఎస్ఐ పరమేశ్వర్, పరకాల ఎస్ఐ రఘుపతి, ఏఏఓ సల్మాన్‌పాషాతో పాటు దామెర, శాయంపేట పోలీసు సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

---

సారంపల్లి మల్లారెడ్డి మృతి

## రైతాంగ ఉద్యమానికి తీరని లోటు

- రైతు ఉద్యమానికి అంకితమైన నేతగా సేవలు
- సీపీఎం, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటు
- మల్లారెడ్డితో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్న కడియం
- గొప్ప ప్రజా నాయకుడిని కోల్పోవడం బాధాకరం : ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కాకతీయ, హైదరాబాద్ : రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఎం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మృతి దేశ రైతాంగ ఉద్యమానికి తీరని లోటని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో మల్లారెడ్డి భౌతికకాయానికి రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం జీవితాంతం పోరాడిన నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. 1987లో రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తనను ప్రోత్సహించిన వారిలో మల్లారెడ్డి ముఖ్యులని గుర్తుచేశారు. ఆయనతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నానని తెలిపారు. మల్లారెడ్డి మరణం సీపీఎం పార్టీతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు కూడా తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నిజామాబాద్ అర్బన్‌లో ఎస్ఐఆర్ ఫేజ్-2 కార్యక్రమం

- ఓటరు జాబితా, ఏఎస్‌డీడీ డేటా సేకరణపై దృష్టి
- కొత్త అర్హులైన ఓటర్లను గుర్తించి ఫారం-6 నమోదు
- ఆగస్టు 27న గ్రామ, వార్డు సభల్లో పాల్గొనాలని పిలుపు
- ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ జంగా రాఘవరెడ్డి సూచన



కాకతీయ, నిజామాబాద్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో డీసీసీ టౌన్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఫేజ్–2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్, రూరల్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఫేజ్–1లో సక్రమంగా పనిచేయని సూపర్‌వైజర్లు, బీఎల్ఏల స్థానంలో కొత్తవారిని నియమించాలని సూచించారు. ఎలక్టోరల్ రోల్, ఏఎస్‌డీడీ డేటాను సేకరించి బీఎల్ఏలకు అందజేసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. అర్హులైన కొత్త ఓటర్లను గుర్తించి ఫారం–6 ద్వారా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఆగస్టు 27న జరిగే గ్రామ, వార్డు సభల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, సూపర్‌వైజర్లు, బీఎల్ఏలు, నాయకులు పాల్గొన్నారు.

## వెంకటస్వామికి కురుమల ఘన సన్మానం

- బార్దన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక
- స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన కురుమ సంఘం నాయకులు



కాకతీయ, వరంగల్ : బార్దన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోరే వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం కురుమ సంఘం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. రామ్‌కిలోని వెంకటస్వామి స్వగృహానికి వెళ్లిన వరంగల్ కురుమ పెళ్లి పందిరి కన్వీనర్లు, మహబూబాబాద్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు చీర అశోక్ కురుమ తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అన్నరాజు కురుమ మాట్లాడుతూ బార్దన్ మర్చంట్ అసోసియేషన్ అభివృద్ధికి వెంకటస్వామి కృషి చేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల నరసింహ, రాములు, నరిగె శ్రీను, బండారి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ లీకేజీపై ఢిల్లీలో కాల్పులా?




- విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులను ఖండించిన యూత్ కాంగ్రెస్
- అమిత్ షా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి
- మోదీ-షా చిత్రపటాలకు నిప్పు పెట్టి నిరసన
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలి..
- యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు బోనాసి క్రాంతికుమార్

కాకతీయ, జనగామ : పేపర్ లీకేజీకి నిరసనగా ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపిన ఘటనను నిరసిస్తూ జనగామ జిల్లా కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు బోనాసి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి అలువాల కార్తీక్ సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోదీ, అమిత్‌షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారి చిత్రపటాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. పేపర్ లీకేజీపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడం దారుణమని యూత్ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరారు.

### ప్రజల హక్కుల కోసం పోరాటం

రాహుల్‌గాంధీ నాయకత్వంలో యూత్ కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని నాయకులు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడంతో పాటు దాని ద్వారా లభించే హక్కులు, ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఉదయ్, జానీబాబా, అభిరామ్, అందే నానిబాబు, పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, జనగామ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శ్రీధర్, పాలకుర్తి ఉపాధ్యక్షుడు రాజేష్‌యాదవ్, సాయిప్రకాష్, మండల అధ్యక్షులు ప్రకాష్‌యాదవ్, బుర్రా నరేష్, బాలరాజ్, మహేష్, రాజు, అబ్బాస్, కృష్ణ, యాకేశ్‌యాదవ్, కార్యవర్గ సభ్యులు గద్దం మణి, పుల్ల విక్రమ్, లక్ష్మణ్, రాకేష్, శేఖర్, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ పడిగం మహేష్, జనగామ పట్టణ నాయకులు కాసాని విజయ్, సోహెల్, లింగం, గ్రామశాఖ అధ్యక్షులు రాజు, పృథ్వి, శ్రీహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

---

బీసీల హక్కుల కోసం పోరాడిన

## మహనీయుడు బీపీ మండల్




- హనుమకొండ రాంనగర్ బీసీ భవన్‌లో ఘనంగా జయంతి వేడుకలు
- సామాజిక న్యాయానికి మండల్ కమిషన్ బలమైన పునాది
- యువత ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి
- మాజీ కుడా చైర్మన్, ఓబీసీ చైర్మన్ ఎస్. సుందర్‌రాజ్ యాదవ్

కాకతీయ, హనుమకొండ : సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు బీపీ మండల్ అని మాజీ కుడా చైర్మన్, ఓబీసీ చైర్మన్ ఎస్. సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్‌లో మంగళవారం బీపీ మండల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుందర్‌రాజ్ యాదవ్ హాజరై బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగాల్లో వెనుకబడిన వర్గాలకు న్యాయం అందించాలనే లక్ష్యంతో బీపీ మండల్ పనిచేశారని గుర్తుచేశారు. ఆయన నాయకత్వంలో ఏర్పడిన మండల్ కమిషన్ భారతదేశ సామాజిక చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. వెనుకబడిన వర్గాల సామాజిక, విద్యా పరిస్థితులను అధ్యయనం చేసి వారికి తగిన అవకాశాలు కల్పించేందుకు సిఫారసులు చేయడం ద్వారా బీపీ మండల్ సామాజిక సమానత్వానికి బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. యువత బీపీ మండల్ జీవితం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సుందర్‌రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ఉద్యమకారుడు గంగాపురం వేణుమాధవ్ గౌడ్, మేనం శ్యామ్, యాదగిరి గౌడ్, నాగరాజు యాదవ్, చిరంజీవి యాదవ్, యుగేందర్ యాదవ్, బీసీ మహిళా నాయకులు పద్మజ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

---

## లాలు తండాలో ఘనంగా వనంహోత్సవం

- చెట్లతో జీవవైవిధ్య సమతుల్యతను కాపాడుతుంది
- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి



కాకతీయ, ఇనుగుర్తి: మొక్కలు నాటి వాటిని పెద్ద చెట్లు అయ్యేదాకా సంరక్షిస్తే అవి జీవవైవిధ్య సమతుల్యతను కాపాడి మానవ జీవనోపాధిలో ఎంతో దోహద పడతాయని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్షి అన్నారు. మండలంలోని లాలు తండ గ్రామంలో సర్పంచ్ భూక్య లక్ష్మీ వెంకన్న నాయక్ ఆధ్వర్యంలో వన మహోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్షి లాలు తండా సర్పంచ్ లక్ష్మీ, ఉప సర్పంచ్ రజిత రాజులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ సమితి లేదను కాపాడడానికి మొక్కలు ఎంతో ప్రాముఖ్యతమని ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జీవన్, రవి బీట్ ఆఫీసర్ భాస్కర్, సెక్షన్ ఆఫీసర్ రామారావు, ఆదినారాయణ, స్కూల్ హెచ్‌ఎం రాములు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తి ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

కాకతీయ, ఇనుగుర్తి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ ఆదేశానుసారం ఎమ్మార్పీఎస్ ఇనుగుర్తి గ్రామ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక చేసి ప్రకటించినట్లు ఇనుగుర్తి మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ చెడుపాక యాకన్న తెలిపారు. గ్రామ నూతన అధ్యక్షుడుగా మల్లెపాక రమేష్, అధికార ప్రతినిధి బూర రాజేష్(చిన్ని), ప్రధాన కార్యదర్శి తమ్మడపల్లి సురేష్, పసునూరి జంపయ్య, ఉపాధ్యక్షులు దేవులపల్లి సునీల్, గుజ్జునూరి మణిరత్నం, గుజ్జునూరి శ్రీకాంత్, కోశాధికారి గబ్బెట సురేష్, కార్యదర్శులు దేవులపల్లి మధు, తమ్మడపల్లి భరత్, ఈసంపల్లి సంపత్(ఆటో), గుజ్జునూరి జంపయ్య, సహాయకార్యదర్శులు కూరెలి నాగరాజు, ఈసంపల్లి సంపత్, తమ్మడపల్లి రాజు, తూళ్ళ యాకయ్య, పులి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు తమ్మడపల్లి యేసు లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు బాధ్యత ఇచ్చిన గ్రామస్తులకు కార్యకర్తలకు సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పడాల కుమార్, మంకాళి రామ్ సలీం, తమ్మడపల్లి అశోక్, సాగర్(సింగర్), గుజ్జునూరి ప్రసాద్, బూర రజినీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కను నాటడం కంటే సంరక్షించడమే ముఖ్యం

సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్



కాకతీయ, పెద్దవంగర : మొక్కను నాటడం కంటే దాన్ని సంరక్షించడమే ముఖ్యమని సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వన మహోత్సవంలో భాగంగా మండల అధికారులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షిస్తేనే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. హరిత గ్రామాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో సురేష్, ఏవో స్వామినాయక్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటిసంరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో టీఏసురేష్, పంచాయతీకార్యదర్శివెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో ఘనంగా తీజ్ ఉత్సవం

- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల సందడి
- పీఎం శ్రీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి. ఉపేందర్‌రావు



కాకతీయ, నెల్లికుదురు : నెల్లికుదురు మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో మంగళవారం తీజ్ ఉత్సవాన్ని సాంస్కృతిక కార్యక్రమంగా ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి తీజ్ పండుగ విశిష్టతను ప్రతిబింబించే పాటలు, నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. ఉపేందర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరగడంతో పాటు పరస్పర గౌరవం, ఐక్యతా భావం పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు తీజ్ ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీభద్రకాళి అమ్మవారికి సారె సమర్పణ

శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు



కాకతీయ, వరంగల్ : శ్రావణమాసం సందర్భంగా వరంగల్ నగరంలోని ప్రసిద్ధ శ్రీభద్రకాళి దేవాలయంలో మంగళవారం అమ్మవారికి సారె సమర్పించారు. రంగసాయిపేటకు చెందిన శంకేసి రమాదేవి ఆధ్వర్యంలోని మహిళల బృందం తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మహిళలు భక్తిశ్రద్ధలతో తయారు చేసిన పిండి వంటకాలను ఆలయానికి తీసుకువచ్చి ప్రధాన పూజారి భద్రకాళి శేషు సమక్షంలో వేదమంత్రాల నడుమ అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఇటికాల సంధ్యారాణి, పెద్ది మమత, మదూరి సంధ్య, అడుప సరిత, దూలం మంజుల, బోరిగం రజిత, కొండ్ర గోపి, కోయడ సుజాత, కుల్ల విజయలక్ష్మి , ద్రౌపతి రజిత తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవ, ఆధార్ కేంద్రాల్లో తనిఖీలు



- అధిక వసూళ్ల ఆరోపణలపై అధికారుల ఆకస్మిక తనిఖీలు
- రేట్ చార్ట్ ప్రకారమే రుసుములు వసూలు చేయాలి
- అదనంగా తీసుకుంటే సస్పెన్షన్, జరిమానా
- దరఖాస్తుదారులతో దురుసుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్న తహసీల్దార్ జగదీశ్వర్
- ఆధార్ కేంద్రాల్లోనూ అధిక రుసుములపై ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ హెచ్చరిక



మీసేవ ఆధార్ కేంద్రాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కాకతీయ, ఏటూరునాగారం : మీ సేవ, ఆధార్ కేంద్రాల్లో నిర్ణీత రుసుములకు మించి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారంటూ 'కాకతీయ'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని మీ సేవ, ఆధార్ కేంద్రాల్లో మంగళవారం తహసీల్దార్ జగదీశ్వర్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేంద్రాల్లో సేవల నిర్వహణ, రుసుముల వసూళ్లు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. నిర్ణీత రేట్ చార్ట్ ప్రకారమే రుసుములు తీసుకోవాలని, అధికంగా వసూలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని నిర్వాహకులను హెచ్చరించారు. ప్రభుత్వ సేవలు అందించాల్సిన కేంద్రాల్లో ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## రేట్ చార్ట్ దాటితే సస్పెన్షన్.. జరిమానా తప్పదు

ఆధార్ కేంద్రాల్లో నిర్ణీత రుసుములకు మించి డబ్బులు వసూలు చేసినట్లు తేలితే సంబంధిత కేంద్రంపై సస్పెన్షన్‌తో పాటు జరిమానా విధిస్తామని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ స్పష్టం చేశారు. మీ సేవ నిర్వాహకులు ఈఎస్‌డీ మార్గదర్శకాల ప్రకారం సేవలు అందిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. దరఖాస్తుదారులతో దురుసుగా వ్యవహరించరాదని, ప్రతి సేవకు సంబంధించిన రుసుముల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. మీ సేవ, ఆధార్ కేంద్రాల్లో సిటిజన్ చార్టర్, భూభారతి ఫ్లెక్సీలు, మీ సేవ లోగోతో పాటు తహసీల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్‌సెంటర్ ఫోన్ నంబర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అధిక వసూళ్లపై ఫిర్యాదులు వస్తే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులు పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

## ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదు.. తహసీల్దార్ హెచ్చరిక

కళ్యాణలక్ష్మి , యూడీఐడీ (సదరం), జనన, మరణ ధ్రువీకరణ పత్రాల నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా సేవలు అందించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మీ సేవ కేంద్రాలపై ఆధారపడుతున్న నేపథ్యంలో వారి అవసరాలను ఆసరాగా చేసుకుని అదనపు రుసుములు వసూలు చేయడం, దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేయడం సహించబోమని తహసీల్దార్ జగదీశ్వర్ తేల్చి చెప్పారు. "నిర్ణీత రుసుము కంటే అధికంగా తీసుకుంటే సంబంధిత మీ సేవ కేంద్రంపై కఠిన చర్యలు తప్పవు. అక్రమ దందాలకు పాల్పడితే సహించేది లేదు" అని హెచ్చరించారు. 'కాకతీయ' కథనంపై అధికారులు వెంటనే స్పందించి తనిఖీలు చేపట్టడంతో.. ఇకనైనా మీ సేవ, ఆధార్ కేంద్రాల్లో అధిక వసూళ్లకు అడ్డుకట్ట పడుతుందా అనే చర్చ మొదలైంది. ఈ తనిఖీల్లో మీ సేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్‌తో పాటు సంబంధిత కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఒక మొక్కను దత్తత తీసుకోవాలి

- రాయపర్తి మండలంలో ఉత్సాహంగా వన మహోత్సవం
- మండల ప్రత్యేక అధికారి వై శ్రీకాంత్ రెడ్డి



కాకతీయ,రాయపర్తి : ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ ఒక మొక్కను దత్తత తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి వై శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.మంగళవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో సర్పంచులు,పంచాయితీ కార్యదర్శులు వనమహోత్సవ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.రాయపర్తి ప్రభుత్వ పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి వై శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై,ఎంపీడీవో పాక శ్రీనివాసులుతో కలిసి ఉపాధ్యాయులు,విద్యార్థులు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం, ఉష్ణోగ్రతల తీవ్రతను అరికట్టడానికి మొక్కలు నాటడమే ఏకైక పరిష్కారం అని అన్నారు.కేవలం నాటడంతో సరిపెట్టడమే కాకుండా,నాటిన ప్రతి మొక్క మహావృక్షంగా మారేంతవరకు కాపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు, పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు విరివిగా నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు.నాటిన ప్రతి మొక్క వివరాలను నమోదు చేస్తూ,వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ కూచన ప్రకాష్,సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి,పంచాయతీ కార్యదర్శి యాకుబ్ నాయక్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారె కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు,కారోబార్ కారుపోతుల రామచంద్రయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పచ్చదనంతో పర్యావరణ సమతుల్యతను కాపాడాలి

జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పిలుపు



కాకతీయ, ములుగు ప్రతినిధి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం గట్టమ్మ సమీపంలోని పంచాయతీరాజ్ పైలాన్ ఆవరణలో కలెక్టర్, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ, వాతావరణ సమతుల్యతకు పచ్చదనం ఎంతో అవసరమన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ సత్తయ్య, జాకారం సర్పంచ్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ ఆదేశం



కాకతీయ, గీసుగొండ : విద్యార్థులకు నిత్యం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ అధికారులను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా గంగదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, వారితో కలిసి భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెన్న కృష్ణవేణి, సర్పంచ్ కూసం స్వరూప రమేష్, ప్రధానోపాధ్యాయులు ఎం.డి. రజాక్, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలి

కాకతీయ, పరకాల: పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గీసుగొండ మండలం కొమ్మాల గ్రామంలో వన మహోత్సవంలో ఆయన మొక్కలు నాటారు. ప్రజల భాగస్వామ్యంతో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యత, సకాలంలో వర్షాల కోసం విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. దామెర మండలం తక్కళ్లపహాడ్, ఆత్మకూరు మండలం గూడెప్పాడు, పరకాల మండలం వెల్లంపల్లి గ్రామాల్లోనూ నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలు నాటారు. పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కార్యాలయం ప్రారంభం

ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యాలయం వేదిక

ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ వెల్లడి



కాకతీయ, తుంగతుర్తి: తుంగతుర్తి మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ప్రారంభించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. బీపీ మండల్ 108వ జయంతి రోజున కార్యాలయాన్ని ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. బీసీలకు రిజర్వేషన్ల కోసం మండల్ కమిషన్ దేశవ్యాప్తంగా సమాచారం సేకరించి సిఫారసులు చేసిందని, ఆయన కృషి ఫలితంగానే బీసీలకు రిజర్వేషన్లు లభించాయని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కార్యాలయం వేదికగా పనిచేస్తుందని తెలిపారు. విశారదన్ మహరాజ్ అన్నారు.

## పస్రా పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ వార్షిక తనిఖీ

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలి

గంజాయి, మాదకద్రవ్యాలపై నిఘా పెంచాలి

ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్



కాకతీయ, ములుగు ప్రతినిధి : ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పస్రా పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం ఉండాలని, పెండింగ్ కేసులను నిర్దేశిత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు వేగంగా స్పందించాలని, బాధితుల సమస్యలను సానుకూలంగా విని పారదర్శకంగా విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరిస్తూ పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గంజాయి, మాదకద్రవ్యాలు, ఇతర అక్రమ కార్యకలాపాలపై నిఘాను మరింత పెంచాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలను నిరంతరం గమనిస్తూ, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. వారి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, వాహనదారులు నిబంధనలు పాటించేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసి ఉంచిన వాహనాలను, వాటికి సంబంధించిన రికార్డులను ఎస్పీ పరిశీలించారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించిన రికార్డులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా సిబ్బంది అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వార్షిక తనిఖీలో ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, పస్రా సీఐ దయాకర్, పస్రా ఎస్ఐ తాజుద్దీన్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలను నాటి సంరక్షించాలి



- ఇంటికో మొక్క నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి
- శుభకార్యాల్లో మొక్కలు నాటే సంప్రదాయాన్ని అలవాటు చేసుకోవాలి
- జిల్లాలో ఇప్పటికే 13 లక్షల మొక్కలు నాటాం
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని చంటిబిడ్డలా సంరక్షించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్‌లోని రంగసాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డా. సత్యశారద అధ్యక్షతన నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం నూతన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి, వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వన మహోత్సవం ఆలస్యమైందని తెలిపారు. ఒక్కరోజులోనే 10 శాతం మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని చెప్పారు. సకాలంలో వర్షాలు కురవకపోవడానికి వృక్ష సంపద తగ్గిపోవడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు. పుట్టినరోజులు, పెళ్లిళ్లు వంటి శుభకార్యాల్లో మొక్కలు నాటే సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. చెట్లను నరకకుండా వాటిని సంరక్షించాలని కోరారు. జిల్లాలో 25 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా కలెక్టర్ డా. సత్యశారద తెలిపారు. ఇప్పటివరకు 13 లక్షల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. మిగిలిన 12 లక్షల మొక్కలను అన్ని శాఖల సమన్వయంతో పూర్తి చేస్తామని చెప్పారు. వృక్ష సంపదను పెంచడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు పంటల దిగుబడులు మెరుగుపడే అవకాశం ఉంటుందని భద్రాద్రి సీసీఎఫ్ భీమా నాయక్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, జెడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఎఫ్ఓ నిఖిత, గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్-పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

14 జిల్లాల్లో 56 కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు

తాగునీరు, విద్యుత్, భద్రతా ఏర్పాట్లు ముందే పరిశీలించాలి

కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : ఆగస్టు 30న జరగనున్న నీట్–పీజీ 2026 పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎస్ సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో నీట్–పీజీ, వర్షాభావం, పర్యాటక అభివృద్ధిపై సమీక్షించారు. రాష్ట్రంలో 56 కేంద్రాల్లో 17,627 మంది పరీక్ష రాయనున్నారని, మొబైల్, బ్లూటూత్, ఏఐ గ్లాసెస్, స్పై కెమెరాలను అనుమతించవద్దని సూచించారు. వరంగల్‌లో నర్సంపేట బిట్స్ కళాశాలలో 132 మంది పరీక్ష రాయనున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. ఎంపిక చేసిన 27 పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలని సీఎస్ సూచించారు. రాష్ట్రంలో 22 శాతం వర్షపాతం లోటు ఉన్న నేపథ్యంలో పంటలు, తాగునీటి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

## మొక్కలే నగరానికి అందం.. పర్యావరణానికి ప్రాణం

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న పిలుపు



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : మొక్కలు నాటి వరంగల్‌ను పచ్చని నగరంగా తీర్చిదిద్దాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న పిలుపునిచ్చారు. మంగళవారం వన మహోత్సవంలో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో తోట మైదానంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ స్వయంగా మొక్కలు నాటారు. మొక్క నాటడంతో పని పూర్తికాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి వృక్షంగా ఎదిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ ప్రదేశాలు, రోడ్ల వెంట, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి నీరు, రక్షణ కల్పించాలని సూచించారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చని, పరిశుభ్రమైన వరంగల్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బస్వరాజ్ కుమారస్వామి, సీఎంహెచ్‌వో లక్ష్మారెడ్డి, ఎంహెచ్‌వో డా. రాజేష్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

# శరవేగంగా సర్వాయిపేట పాపన్న గౌడ్ టూరిజం ప్రాజెక్ట్







**నాణ్యతతో పనులు త్వరగా పూర్తి చేయాలి**

**మ్యూజియం, ఫ్లోరింగ్, గార్డెనింగ్ పనులపై ప్రత్యేక దృష్టి**

**సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు**

కాకతీయ, కరీంనగర్ : హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండలం సర్వాయిపేటలో అభివృద్ధి చేస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ టూరిజం ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. టూరిజం ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ పనులను మంత్రి పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు, పరిసరాల అభివృద్ధిపై అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్వాయిపేటలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ టూరిజం ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆ హామీకి అనుగుణంగానే ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్ట్‌ను ప్రారంభించేలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్‌లో నిర్మిస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మ్యూజియం పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. మ్యూజియం భవనం ముందు ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు గార్డెనింగ్, బ్యూటిఫికేషన్ పనులను చేపట్టి సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు పరిచయం చేసేలా టూరిజం ప్రాజెక్ట్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు.

## జీవో 97ను వెంటనే రద్దు చేయాలి

**పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏబీవీపీ నిరసన**



కాకతీయ,చేర్యాల: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాలిటెక్నిక్ కళాశాలల బంద్ కార్యక్రమంలో భాగంగా చేర్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు నిరసన చేపట్టారు. తరగతులను బహిష్కరించి కళాశాల ముందు జీవో 97 పత్రాలను దహనం చేసి బంద్‌ను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలని అన్నారు. జీవో 97 అమలు వల్ల విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, ఆధునిక సాంకేతిక పరికరాల కొరత వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. కావున ప్రభుత్వం జీవో 97ను తక్షణమే రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు పూర్తి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఏబీవీపీ ఇన్‌చార్జ్ సాయి, మేఘన, రమేష్తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

### తండ్రి ప్రేమ కోసం

## కూతురి ఆమరణ నిరాహార దీక్ష



**కుటుంబ వివాదంతో ఆడబిడ్డ ఆవేదన**


**తండ్రి తనను దూరం పెట్టారని యువతి ఆరోపణ**

**న్యాయం కోసం భద్రాచలంలో దీక్షకు కూర్చున్న కూతురు**

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి : తండ్రి ప్రేమ కోసం ఓ కూతురు ఆమరణ నిరాహార దీక్షకు దిగిన ఘటన భద్రాచలంలో చర్చనీయాంశంగా మారింది. తల్లిదండ్రుల మధ్య కుటుంబ వివాదం కారణంగా తనను తండ్రి దూరం పెడుతున్నారని ఆరోపిస్తూ యువతి న్యాయం కోసం దీక్షకు కూర్చుంది. తండ్రి మాట కోసం రాజ్యాన్నే వదులుకున్న రాముడు నడయాడిన భద్రాద్రి నేలపై.. తండ్రి ప్రేమ కోసం ఓ కూతురు కన్నీటి పోరాటానికి దిగడం పలువురిని కలచి వేస్తోంది. యువతి తెలిపిన వివరాల ప్రకారం.. తల్లిదండ్రుల కుటుంబ వివాదం కారణంగా తనను తండ్రి దూరం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తల్లితో సంబంధాలు కొనసాగిస్తున్నారనే కారణంతో తనను దగ్గరకు రానివ్వడం లేదని ఆరోపించింది. తల్లితో మాట్లాడి విడాకులు తీసుకుంటేనే తనను అంగీకరిస్తానని తండ్రి చెబుతున్నారని పేర్కొంది. తన తల్లిని తండ్రి మానసికంగా వేధించి ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చేర్పించారని యువతి ఆరోపించింది. తనకు ఎలాంటి సమస్య లేదని నిరూపించుకుని తల్లి ఆస్పత్రి నుంచి బయటకు వచ్చారని తెలిపింది. కొన్నేళ్లుగా తమ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించింది. ప్రభావశీల వ్యక్తుల అండతో తాము ఎక్కడికి వెళ్లినా న్యాయం దక్కడం లేదని, చివరకు తన తండ్రి ప్రేమ కోసం ఆమరణ నిరాహార దీక్షకు దిగాల్సి వచ్చిందని యువతి ఆవేదన వ్యక్తం చేసింది. తండ్రి ప్రేమ కోసం ఓ కూతురు రోడ్డుపైకి రావడం బాధాకరమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ కుటుంబ వివాదంపై అధికారులు స్పందించి, యువతి చేస్తున్న ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## బీఆర్ఎస్ నేత తాజుద్దీన్‌కు పువ్వాడ నివాళి

- గుండెపోటుతో తాజుద్దీన్ అకాల మరణం
- పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి
- పార్టీకి, మైనారిటీ సమాజానికి తీరని లోటని సంతాపం
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



కాకతీయ, ఖమ్మం : బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహమ్మద్ తాజుద్దీన్ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తాజుద్దీన్ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి, ముస్లిం మైనారిటీ సమాజానికి, కుటుంబానికి తీరని లోటని పువ్వాడ అజయ్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాజుద్దీన్‌తో తనకున్న అనుబంధాన్ని, పార్టీ కోసం ఆయన చేసిన సేవలను పువ్వాడ అజయ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తాజుద్దీన్ అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించిన ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. తాజుద్దీన్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం ఖమ్మం నగర బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, కూరాకుల నాగభూషణం, ఖమర్, కర్నాటి కృష్ణ, భీరెడ్డి నాగచంద్రరెడ్డి, బత్తుల మురళి తదితరులు తాజుద్దీన్ పార్థివదేహంపై బీఆర్ఎస్ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ భూముల్లో పైపులైన్ తొలగింపు

**కథనంపై స్పందించిన ఎస్సారెస్పీ అధికారులు**

**క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఏఈ పావని**

**ఎస్సారెస్పీ భూములను పరిరక్షిస్తాం : ఏఈ పావని స్పష్టీకరణ**



కాకతీయ, శంకరపట్నం: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ఎస్సారెస్పీ ప్రభుత్వ భూములను సాగుకు సిద్ధం చేస్తున్నారంటూ సోమవారం 'కాకతీయ' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఎస్సారెస్పీ డీఈ నవీన్, ఏఈ పావని మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. భూమిలో ఏర్పాటు చేసిన పైపులైన్‌ను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ పావని సంబంధిత వ్యక్తులను ఫోన్‌లో సంప్రదించి పైపులైన్ ఏర్పాటు విషయంపై ఆరా తీశారు. అయితే తాము పైపులైన్ ఏర్పాటు చేయలేదని, తమ పొలానికి చెందిన అనిల్ తదితరులు వేసి ఉండవచ్చని వారు సమాధానం ఇచ్చినట్లు ఏఈ తెలిపారు. పైపులైన్ ఏర్పాటు చేసిన విషయంపై స్పష్టత కోసం అనిల్‌ను సంప్రదించగా, ఎస్సారెస్పీ భూముల్లో తాము ఎలాంటి పైపులైన్ ఏర్పాటు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. తమపై వస్తున్న ఆరోపణలకు తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

**భూమిలో చెట్లు నాటే యోచన**

ఎస్సారెస్పీ భూముల పరిరక్షణలో భాగంగా ఇప్పటికే ఎంపీడీవోకు సమాచారం అందించినట్లు ఏఈ పావని తెలిపారు. సదరు భూమిలో చెట్లు నాటాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ చెట్లు నాటించి ప్రభుత్వ భూమిని పరిరక్షించేలా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పైపులైన్‌ను తొలగించడంతో ఎస్సారెస్పీ భూముల పరిరక్షణపై చర్యలు ప్రారంభమైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇకపై ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో లష్కర్ అభినయ్ పాల్గొన్నారు.

### మైనారిటీ మహిళలు ఆర్థికంగా

## స్వావలంబన సాధించేలా ప్రత్యేక చర్యలు



- 600 మంది మహిళలకు రూ.72 లక్షల విలువైన కుట్టు మిషన్లు
- 60 మంది కాశ ముస్లిం లబ్ధిదారులకు రాతి కటింగ్ యంత్రాలు
- మైనారిటీల సంక్షేమానికి పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రత్యేక ప్రాధాన్యం
- రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



కాకతీయ, పెద్దపల్లి : మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని ఎంబీ గార్డెన్స్‌లో మంగళవారం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు, కాశ ముస్లిం లబ్ధిదారులకు రాతి కటింగ్ యంత్రాలను టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ మహమ్మద్ ఒబైదుల్లా కోత్వాల్‌తో కలిసి ప్రభుత్వ విప్ పంపిణీ చేశారు. విజయరమణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెద్దపల్లి జిల్లాలో కేవలం 200 కుట్టు మిషన్లు మాత్రమే పంపిణీ చేశారని, పెద్దపల్లి పట్టణంలో 70 మిషన్లు మాత్రమే అందించారని తెలిపారు. ప్రజాప్రభుత్వం ఒక్కరోజులోనే 600మంది మైనారిటీమహిళలకు కుట్టుమిషన్లు అందిస్తోందని పేర్కొన్నారు.

**రూ.36 లక్షల సబ్సిడీతో రాతి కటింగ్ యంత్రాలు**

పెద్దపల్లి జిల్లాలో కాశ ముస్లిం వర్గాలకు చెందిన 60 మంది లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.60 వేల సబ్సిడీతో రాతి కటింగ్ యంత్రాలను పంపిణీ చేసినట్లు విజయరమణరావు తెలిపారు. వీటి మొత్తం సబ్సిడీ విలువ రూ.36 లక్షలు అని వివరించారు. అదేవిధంగా 600 మంది మైనారిటీ కుటుంబాలకు ఒక్కొక్కటి రూ.12 వేల విలువైన కుట్టు మిషన్లను అందిస్తున్నామని, వీటి మొత్తం విలువ రూ.72 లక్షలు అని తెలిపారు. వీటి ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మైనారిటీల సంక్షేమానికి పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. రాఘవాపూర్‌లో మైనారిటీల శ్మశానవాటిక కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. పెద్దపల్లి పట్టణంలో మైనారిటీల శ్మశానవాటిక కోసం 8 గుంటల స్థలాన్ని కేటాయించామని, షాదీఖానా నిర్మాణానికి కూడా స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మైనారిటీ కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజయరమణరావు సూచించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, స్థానిక కౌన్సిలర్, మత పెద్దలు, పెద్దపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యామ్నాయ పంటలతో

## అభివృద్ధి వైపు రైతు అడుగులు

- బంతిపూల సాగుతో రైతుకు మంచి ఆదాయం
- వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి
- ఆయిల్‌పామ్‌తో 25–30 ఏళ్ల పాటు నిరంతర ఆదాయం
- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



కాకతీయ, గంభీరావుపేట : ప్రత్యామ్నాయ పంటల సాగు రైతుల అభివృద్ధికి బాటలు వేస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. మంగళవారం గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న ప్రత్యామ్నాయ పంటలను ఆమె పరిశీలించారు. గజసింగవరం గ్రామానికి చెందిన రైతు బోయిని మల్లేశం తనకున్న మూడున్నర ఎకరాల్లో రెండు ఎకరాల్లో జూలైలో బంతిపూల సాగు చేపట్టారు. నాటిన 65 రోజుల నుంచి పూల కోత ప్రారంభమై డిసెంబర్ వరకు కొనసాగుతుందని కలెక్టర్ తెలుసుకున్నారు. ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి పూలను కోయవచ్చని రైతు వివరించారు. ఎకరానికి 45 నుంచి 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని, కిలో బంతిపూలకు సుమారు రూ.60 ధర లభిస్తోందని మల్లేశం తెలిపారు. ఉద్యానవన శాఖ ద్వారా విత్తనాలు, ఎరువులకు 50 శాతం రాయితీ లేదా ఎకరానికి రూ.8 వేల చొప్పున గరిష్ఠంగా ఐదు ఎకరాల వరకు సబ్సిడీ అందుతోందని వివరించారు. దసరా, దీపావళి తదితర పండుగలు, శుభకార్యాల సమయంలో పూలకు డిమాండ్ పెరగడంతో మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా రైతు మల్లేశంను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా బంతిపూల సాగు చేపట్టి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. ఇతర రైతులు కూడా మల్లేశంను ఆదర్శంగా తీసుకుని ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు.

**ఆయిల్‌పామ్‌తో దీర్ఘకాలిక ఆదాయం**

రైతులు సంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా 17 వేల ఎకరాల్లో కూరగాయలు, పూల మొక్కల సాగుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో 1,250 ఎకరాల్లో కూరగాయలు, 35 ఎకరాల్లో వివిధ రకాల పూల సాగు జరుగుతోందని వివరించారు. వీటి ద్వారా రైతులకు నిరంతర ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో 25 నుంచి 30 ఏళ్ల పాటు నిరంతర ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 162 మంది రైతులు 420 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టారని చెప్పారు. మొదటి మూడేళ్లలో అంతర పంటలు సాగు చేసుకుంటూ అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రతి మంగళవారం క్షేత్రస్థాయిలో రైతులను కలిసి సాగు విధానాలు, దిగుబడి, లాభాలపై వివరాలు తెలుసుకుంటూ రైతులకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమ్మారెడ్డి విమల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్‌బాబు, గంభీరావుపేట ఎంపీడీవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

- నాణ్యమైన, పోషకాహారం అందించాలి
- అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి
- టాయిలెట్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- విద్యార్థుల వసతులపై ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్ గరిమ అగ్రవాల్



కాకతీయ, గంభీరావుపేట: ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గంభీరావుపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యత, స్టోర్‌రూమ్, తరగతి గదులు, వసతి సౌకర్యాలను పరిశీలించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, టాయిలెట్ల పనులను వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని మిషన్ భగీరథ, గ్రిడ్, ఇంట్రా అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, వంట సరుకులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.